క్లుప్తంగా

ఇందిరా గాంధీకి ఘన నివాళి



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు అడ్వొకేట్ రాంరెడ్డి, మోహన్ రెడ్డి, షేక్ నజీర్, బోడ్ల రాజు, హన్మండ్లు, ఇబ్రాహిం, బాల్‌రాజ్, సైలాని, నర్సింహ చారి, మోహ్మద్, అద్నాన్ మహి తదితరులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయి 98వ జయంతి సందర్భంగా ఆదివారం కామారెడ్డి అయ్యప్పనగర్‌లోని శ్రీసత్యసాయి సేవా సమితి కేంద్రంలో ఈనెల 23 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మహిళా దినోత్సవం నిర్వహించారు. సామూహిక సాయి గాయత్రీ హోమం, భజనలు, దీపోత్సవం చేశారు. ఉదయం పూట, తెల్లవారుజామున పట్టణంలో నగర సంకీర్తన, ప్రశాంతి పతాకా విష్కరణ, సత్యసాయి వ్రతం, నారాయణ సేవ చేశారు.

యువకుల రక్తదానం



కామారెడ్డి అర్బన్: శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి సందర్భంగా కామారెడ్డి పట్టణ పరిధిలోని సరంపల్లి గ్రామంలో ఆదివారం శ్రీసత్యసాయి సేవా సమితి రక్తదాన శిబిరం నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొన్న రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ.. సత్యసాయి విశ్వమానవాళికి అందించిన సేవ, ప్రేమ, శాంతి సందేశాలు అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సమితి ప్రతినిధులు శ్రీనివాస్, నాగసాయి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు జమీల్, డాక్టర్ అనిల్, శ్రీధర్‌గౌడ్, కేవీఎస్ రక్తనిధి ప్రతినిధులు జీవన్, వెంకట్, సరంపల్లి పాలసంఘం అధ్యక్షుడు ఆకుల రవికుమార్ పాల్గొన్నారు.

పోచారంను భారీ మెజార్టీతో గెలిపించండి



బాన్సువాడ రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్న పోచారం శ్రీనివాస్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సొసైటీ మాజీ చైర్మన్ పిట్ల శ్రీధర్ కోరారు. ఆదివారం ఆయన కొయ్యగుట్ట తండా, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయిస్ కాలనీల్లో కౌన్సిలర్ హకీమ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన సేవలను వివరిస్తూ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

మున్సిపల్ చైర్మన్ ప్రచారం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని పలు గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. మండలంలోని మల్లయ్యపల్లి, శివానగర్ తదితర గ్రామాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి సురేందర్‌ను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ ఉషాగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు జలంధర్‌రెడ్డి, సురేందర్ తదితరులున్నారు.

నేడు పలు గ్రామాల్లో ప్రభుత్వవిప్ ప్రచారం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సీఎం కేసీఆర్ తరుపున కామారెడ్డి మండలంలోని గర్గుల్, ఇస్రోజీవాడి, తిమ్మక్‌పల్లి(జీ), శాబ్దిపూర్, శాబ్దిపూర్ తండా, గూడెం, తిమ్మక్‌పల్లి(కె) గ్రామాల్లో సోమవారం ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ పిప్పిరి అంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఎల్లారెడ్డిలో గెలిచేది కాంగ్రెస్సే

- ప్రజా సేవే లక్ష్యంగా పనిచేస్తా
- కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు



శెట్పల్లితండాలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న మదన్‌మోహన్



ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పుతున్న మదన్‌మోహన్

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో గెలవబోయేది కాంగ్రెస్ పార్టీయేనని ఎల్లారెడ్డి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన లింగంపేట మండలంలోని మెంగారం, శెట్పల్లితండా, శెట్పల్లి, అయ్యపల్లి, పర్మళ్ల, తదితర గ్రామాల్లో ఇంటింటి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సేవే లక్ష్యంగా తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ప్రతీ ఇంటికి ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయన్నారు. ఇప్పటి వరకు పాలించిన నాయకులు ఏ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో రోడ్లు, మురికి కాల్వలు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, తాగునీరు, అందించి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. పోడు భూములకు పట్టాలు ఇప్పిస్తామన్నారు. ధరణిలో లోపాలను సరిచేస్తామన్నారు. 119 నియోజకవర్గాల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గమే వెనుకబడి ఉందన్నారు. దీనికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ కారణమన్నారు. తాను కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతీ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్, హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలోని 7వ వార్డులో వినోద్ గౌడ్‌తో పాటు వంద మంది మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి మదన్‌మోహన్ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో విద్యాసాగర్, వేణు, భూమయ్య ఉన్నారు.

మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి





పల్లెబోగుడతండాలో గిరిజనులను ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే.. పార్టీలో చేరుతున్న యూత్ సభ్యులు

- ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గడిచిన ఐదేళ్ల కాలంలో తాను చేసిన అభివృద్ధిని చూసి ఈ ఎన్నికలల్లో తనను ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వాలని ఎల్లారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి జాజాల సురేందర్ కోరారు. నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం, పల్లెబోగుడతండా, బెజుగంచెరువుతండా, జప్తిజాన్కంపల్లి, ఎర్రకుంటతండా, మొల్లకుంటతండాలో ఆదివారం ఆయన తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.వందల కోట్లతో ఎల్లారెడ్డిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామని అన్నారు. 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయడంతోపాటు రూ.5 కోట్లతో బస్టాండ్ నిర్మించుకుంటున్నామని, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. గాంధారి మండలంలోని గండివేట్‌లో కాంగ్రెస్ నాయకుడు ముగ్గురు బీఆర్‌ఎస్ నేతలపై కత్తితో దాడిచేసి వారిని తీవ్రంగా గాయపర్చాడన్నారు. మాజీఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గాంధారిలో చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. తనను మరో సారి గెలిపిస్తే మిగిలిన సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, జెడ్పీటీసీ శంకర్ నాయక్, సర్పంచ్ సంజీవుపాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన యూత్ సభ్యులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాకు చెందిన యూత్ సభ్యులు ఉప సర్పంచ్ రజియోద్దిన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. తీగల నాగాగౌడ్, రాజేశ్వర్ రావు, జెడ్పీ కో–ఆప్షన్ మోహినొద్దిన్, సాయిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం



దోమకొండలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



తిప్పాపూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

దోమకొండ: దోమకొండలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రేవంత్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వారు ఓటర్లను కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారాం మధు, గోపాల్‌రెడ్డి, ఆకబోయిన శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, వినీత్, తదితరులు ఉన్నారు.

భిక్కనూరు పరిధిలో..

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులకు రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సౌభాగ్యలక్ష్మి పథకాల గురించి ప్రజలకు వివరించి ఓట్లను అభ్యర్థించారు.

ఎల్లారెడ్డిలో ఓటర్ స్లిప్పుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మన్నె ప్రభాకర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సురేష్‌లు ఆదివారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈనెల 30న ఎన్నికలు జరగనుండడంతో ప్రతి ఒక్కరు ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో బీఎల్‌వో తదితరులున్నారు.

చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

- జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే



సింధే సమక్షంలో చేరుతున్న లింగంపల్లి కాంగ్రెస్ కార్యకర్తలు..



మొగాలో ఎల్ఈడీ స్క్రీన్‌తో ప్రచారం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గడపగడపకు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి చూసి మళ్లీ గెలిపించాలని జుక్కల్ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధే పేర్కొన్నారు. ఆదివారం జగన్నాథ్‌పల్లి, చిన్నతక్కడ్‌పల్లి, లింగంపల్లి, విఠల్‌వాడి, బాబుల్‌గావ్, విఠల్‌వాడి తండా, పోచారంతండా, పోచారం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. పలు గ్రామాలలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సింధే మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడ్డాక తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన..పంచాయతీ భవనాలు మంజూరు చేసి భవనాలు కూడా నిర్మించుకునేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు వలసవాదులని, వారిని నమ్మి మోసపోవద్దని అన్నారు. మరోసారి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. అందరూ ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విజయ్ దేశాయ్, బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్మన్ ఖండేరావు, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు

నిజాంసాగర్(జుక్కల్): కాంగ్రెస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలు నమ్మవద్దని, కారు గుర్తుకు ఓట్లు వేసి హన్మంత్ సింధేను గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి హన్మంత్ సింధేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వాజిద్‌అలీ, హాలీ సిరాజు, దండు లక్ష్మణ్, సాయిరెడ్డి, కాశిరెడ్డి, బొగ్ర సురేశ్, నరేశ్, అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

కారు గుర్తుకు ఓటేస్తేనే పథకాలు

మద్నూర్(జుక్కల్): కారు గుర్తుకు ఓటేస్తేనే కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఉంటాయని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని మొగా సర్పంచ్ సూర్యకాంత్ పటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండలంలోని మొగాలో ఆదివారం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ఆధ్వర్యంలో అన్ని గ్రామాలకు రోడ్లు, విద్య, వైద్యం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాయన్నారు.

కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



కామారెడ్డిలో ప్రచారం నిర్వహిస్తున్న కేసీఆర్ బావ డి.రామారావు, నిట్టు జాహ్నవి, తదితరులు



రామేశ్వర్‌పల్లిలో.. పున్న రాజేశ్వర్



దేవునిపల్లిలో..



దోమకొండలో..

కామారెడ్డి రూరల్: కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఆదివారం శాబ్దిపూర్ గ్రామంలో ఎంపీపీ పిప్పిరి అంజనేయులు ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి మరింత అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకు ఓటు వేసి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నేతలు నిమ్మమోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో..

కామారెడ్డి క్రైం/కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం విస్తృతంగా ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. 15, 16, 17 వార్డుల పరిధిలో పర్యటించిన సీఎం కేసీఆర్ బావ, సీనియర్ న్యాయవాది డి. రామారావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డిలు బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. రామేశ్వర్‌పల్లిలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, కౌన్సిలర్ రవి, ఉప సర్పంచ్ నర్సాగౌడ్, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలోని 10, 12, 35వ వార్డులలో గడపగడపకు బొట్టు పెడుతూ ప్రచారం చేశారు. అలాగే భిక్కనూరు, రాజంపేట, దోమకొండ మండలాల్లో స్థానిక నేతలు ఇంటింటి తిరిగి ప్రచారం చేశారు.



శాబ్దిపూర్‌లో.. ఎంపీపీ పిప్పిరి అంజనేయులు



రాజంపేటలో..



భిక్కనూరులో..



కామారెడ్డి రూరల్‌లో..

కత్తిపోట్ల దాడిని ఖండించిన బీఆర్‌ఎస్



రాజంపేటలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు



తాడ్వాయిలో.. బీఆర్‌ఎస్ నేతలు

రాజంపేట: గాంధారి మండలంలోని గండివేట్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడి చేసి కత్తితో పొడిచిన ఘటనను మండల బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, సిరడి శంకర్, బల్‌రాం, గణేష్ నాయక్, దిలీప్ గౌడ్‌లు ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. కారకులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లో గుండాల రాజకీయం

ఎల్లారెడ్డి: ప్రశాంతంగా ఉన్న ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాన్‌లోకల్ నాయకులు గూండా రాజకీయం చేస్తున్నారని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జలంధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడారు. కత్తి పోట్ల ఘటనను ఖండించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, తదితరులున్నారు.

గూండాయిజం చేస్తే ప్రజలు ఊరుకోరు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గుండాయిజం చేస్తే ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజలు ఊరుకోరని మండల బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్‌రావు అనుచరులు, ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు కత్తితో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మదన్ మోహన్‌రావు ఓటమి భయంతోనే దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు భూంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడులు సమంజసం కాదు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు కత్తితో దాడి చేయడం సమంజసం కాదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గూండాల్లాగా ప్రవరిస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆరోపించారు. తాడ్వాయిలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ఎమ్మెల్యే అభ్యర్థి మదన్‌మోహన్ నాన్ లోకల్ అని, ఎక్కడి నుంచో కిరాయిగూండాలను తీసుకవచ్చి దాడులు జరిపిస్తుడని, ఎమ్మెల్యేగా గెలవక ముందే దాడులు జరుగుతున్నాయని, గెలిస్తే మాత్రం ఎల్లారెడ్డి మరింతగా దారుణంగా తయారవుతుందన్నారు. ఏఎంసీ చైర్మన్ సాయిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంజీవులు, తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

గ్రామాల్లో పోటాపోటీగా ఎన్నికల ప్రచారం



తాడ్వాయిలో ప్రచారం చేస్తున్న నేతలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు దాదాపు అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. ఆయా పార్టీల మేనిఫెస్టోలను ఓటర్లకు వివరిస్తున్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి జాజాల సురేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు.



సదాశివనగర్‌లో..

ప్రచార రథాలు అదుర్స్







మద్నూర్(జుక్కల్): ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసి ప్రచార పర్వంలోకి దిగారు. సమయం తక్కువగా ఉండటంతో ఇప్పటి వరకు చేస్తున్న ఇంటింటి ప్రచారం కాస్త ఇక నుంచి రథమెక్కనుంది. ఎన్నికలు ఏవైనా ముందుగా గుర్తుకు వచ్చేది ప్రచారమే. ఓటర్లను అన్ని రకాలుగా ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎవరి శైలిలో వారు ప్రచారాలు సాగిస్తుంటారు. చూడగానే ఆకట్టుకునేలా అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల రథాలు ఇంటింటి ప్రచారం చేస్తున్నాయి.